నమస్తే తెలంగాణ
హైదరాబాద్, గురువారం, 4 జూలై 2024
THURSDAY, JULY 4, 2024

లక్ష్మీనరసింహుడికి వైభవంగా కల్యాణోత్సవ సేవ

ఎమ్మెల్సీ వాణీదేవికి ప్రసాదం అందిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, జూలై 3: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో బుధవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్ల దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై ఊరేగించారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహ స్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాల ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం జరిపారు. ప్రధానాలయంలో సాయంత్రం వేళలో స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 18,82,227 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ వాణీదేవి

లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి బుధవారం దర్శించుకున్నారు. స్వామివారి కొండకు చేరుకున్న ఆమె పంచ నారసింహ స్వామి ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఈఓ భాస్కర్‌రావు స్వామి వారి ప్రసాదాన్ని అందించారు.

యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూలై 3 : యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలువాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రాయగిరిలో ఏర్పాటు చేసిన వినయ్ క్రికెట్ అకాడమీని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ తోటకూరి వెంకటేశ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కూర వెంకట్, నాయకులు పల్లెర్ల యాదగిరి, నాయిని పూర్ణచందర్, సామల రవీందర్, ఎండీ. ఫసియొద్దీన్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలి

- కాంప్లెక్స్ హెచ్‌ఎం అండాలు

మాట్లాడుతున్న కాంప్లెక్ ప్రధానోపాధ్యాయురాలు అండాలు

భువనగిరి కలెక్టరేట్, జూలై 3 : విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో ముందుండాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎన్. అండాలు అన్నారు. భాషా సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని రాయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నాట్య శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు నాట్యంలో శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. 45 రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమం ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాట్య కళాక్షేత్రం నిర్వాహకురాలు రాజరాజేశ్వరి, సినీ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ ఎం. రాజన్నమాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లెప్రసీ కాలనీలో వసతులు కల్పించాలి

- సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్.

బీబీనగర్ లెప్రసీ కాలనీనిలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

బీబీనగర్, జూలై 3 : పట్టణంలోఏని లెప్రసీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని లెప్రసీ కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో 18 సంవత్సరాల నుంచి సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, కరెంటు స్తంభాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీలో అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలని, చుట్టూ ప్రహరీ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ కార్యదర్శి బండారు శ్రీరాములు, నాయకులు చంచల సురేందర్, ఎల్లమ్మ, సీతమ్మ, కిషన్ కుమార్, మామిడి రాజేశ్వరి, తొట్ట రజిత, ప్రవీణ్, చంద్రకళ పాల్గొన్నారు.

జంగంపల్లిలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి

ప్రజాసేవే లక్ష్యం

- పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి

యాదగిరిగుట్ట, జూలై 3: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమని యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జంగపల్లిలో రూ.3 లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్న లక్ష్యంతో ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ సర్పంచ్ గుండ్ల సరితామల్లారెడ్డి, గ్రామ ప్రజలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు ధీరావత్ రమేశ్, మేకల రాజు, మాజీ ఉపసర్పంచ్ గుంటి శ్రీశైలం, నాయకులు సున్నం లక్ష్యయ్య, కౌడె మహేందర్, మాటూరి బాలయ్య, అందె శ్రీశైలం, తిరుమల భాస్కర్ పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత

రామన్నపేట (వలిగొండ), జూలై3: నిషేధిత గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తున్న కిరాణం షాపుపై ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం దాడి చేసి సుమారు రూ. 50 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను సీజ్ చేశారు. వలిగొండ మండల కేంద్రంలో ఉన్న రాందేవ్ కిరాణం దుకాణ యజమాని చేతన్ ప్రకాశ్ నిషేధిత గుట్కాలను అమ్ముతున్నట్లు అందిన సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. అక్రమంగా నిల్వచేసిన గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసి స్థానిక పోలీస్‌లకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్ ఐలయ్య, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

నీటి ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), జూలై 3 : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జడ్పీ నిధులు రూ.16లక్షలతో నిర్మించిన నీళ్ల ట్యాంక్‌ను ప్రారంభించారు. పల్లెర్లలో రూ.5లక్షలతో నిర్మించనున్న సంఘబంధం భవనం, రూ.5లక్షలతో నిర్మించనున్న రజక సంఘం భవనం, సిద్దాపురంలో రూ. 5లక్షలతో నిర్మించనున్న భవనానికి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విడుతల వారీగా నిధులు కేటాయించి పల్లెల్లో వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సునీత, ఎంపీటీసీలు యాస కవిత, సోలిపురం మల్లారెడ్డి, ఎంపీటీసీ పద్మావతి, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బీబీనగర్ : మండలంలోని జమీలాపేట్ ప్రభుత్వ పాఠశాలలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదిని జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి ప్రారంభించారు. నెమరుగోముల గ్రామంలో బీసీ కమ్యూనిటీహాలు మిగులు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, జడ్పీటీసీ గోలి ప్రణితా పింగళ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సంకూరి నాగరాజు, కరిమిండ్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను వీడే వారికి రాజకీయ సమాధి తప్పదు

- బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి

రాజాపేట, జూలై 3 : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీ వీడుతున్న నాయకులకు రాబోయే రోజుల్లో రాజకీయ సమాధి తప్పదని బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, జిల్లా నాయకుడు సట్టు తిరుమలేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ కట్టబెట్టిన పదవులకు స్వచ్ఛందంగా వదులుకొని వేరే పార్టీలో చేరాలన్నారు. కొంత మంది పార్టీ వీడినంత మాత్రాన బీఆర్‌ఎస్‌కు నష్టం లేదన్నారు. అలాంటి వంద మంది నాయకులను తయారు చేయగల సామర్థ్యం పార్టీ అధినేత కేసీఆర్‌కు ఉందన్నారు. సమావేశంలో నాయకులు సందిల భాస్కర్‌గౌడ్, బోగ హరినాథ్, రేగు సిద్ధులు, బిల్ల శ్రీనివాస్, మోత్కుపల్లి నవీన్, బాలకృష్ణ, వెంకటేశ్, వరిమడ్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రామన్నపేట(వలిగొండ), జూలై 3 : వలిగొండ మండల కేంద్రానికి చెందిన మత్స్యకార్మికుడు జొర్క వెంకటేశం కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వలిగొండ మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం ఆధ్వర్యంలో బుధవారం అతడికి రూ.29,200 అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సోమనబోయిన సతీశ్, బోళ్ల రామచంద్రం, బోళ్ల సుదర్శన్, బుంగమట్ల శంకరయ్య, తాళ్ల సత్యనారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మహేందర్

యాదగిరిగుట్ట, జూలై3: నీట్ పరీక్ష నిర్వహణలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యువజన, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ కోరారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి కారణమైన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని, పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కంబాల వెంకటేశ్, తోటకూరి రాజశేఖర్, నాయకులు అనంతుల నర్సింహ, మహేశ్, కోల హరీశ్, కంబాల నర్సింహ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు ఘనంగా వీడ్కోలు

తుర్కపల్లిలో ప్రజా ప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

తుర్కపల్లి : ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల ఐదేండ్ల పదవీకాలం పూర్తైన సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రజాప్రతినిధులను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో పాటు అధికారులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. తాను చదువుకున్న మాదాపురం పాఠశాలకు తన తండ్రిపేర రూ.5లక్షలు ఇవ్వడంతో పాటు ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.50లక్షలు మంజూరు చేసి మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దుతారని ఎమ్మెల్సీ ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా సుశీలారవీందర్, జడ్పీ వైస్‌చైర్మన్ బీకునాయక్, వైస్‌ఎంపీపీ మహదేవుని శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, తాసీల్దార్ దేశియా, ఎంపీడీఓ జాన్సీలక్ష్మీబాయి, ఎంపీటీసీలు పలుగుల నవీన్‌కుమార్, గిద్దె కర్ణాకర్, సంతోశ్‌భాస్కర్‌రెడ్డి, మోహన్‌బాబు, వనజ, ప్రతిభారాజేశ్, కనకలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

- ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి

బొమ్మలరామారం, జూలై 2 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి ఉన్నత స్థాయికి ఎదుగాలని ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత దయాలాల్ పటేల్ అందించిన నోటుపుస్తకాలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ జె.కృష్ణ, మండల నోడల్ అధికారి రోజారాణి, జీహెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసేవారికి తప్పక గుర్తింపు

- ఎంపీపీ అమరావతి

ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

గుండాల, జూలై 3: ప్రజాసేవ చేసేవాళ్లకు ఎప్పటికీ ప్రజల్లో గుర్తింపు ఉంటుందని ఎంపీపీ తాండ్ర అమరావతీశోభన్‌బాబు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో ఎంపీపీ, జడ్పీటీసీతో పాటు ఎంపీటీసీలను ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కోలుకొండ లక్ష్మీరాములు, జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.ఖలీల్, వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండీ.షర్ఫొద్దీన్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కలిసి పని చేయాలి

- ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

మీటింగ్‌హాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జూలై 3 : మండల అభివృద్ధి కోసం అందరూ కలిసి పని చేయాలని కృషి చేయాలని ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆధునీకరించిన మండల పరిషత్ కమిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రజా ప్రతినిధులు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కోట పుష్పలతామల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, పీఆర్ ఏఈ వెంకటేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాతుక లింగస్వామి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షురాలు మాధవీశ్రీశైలంగౌడ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అర్రూరులో కంటి వైద్య శిబిరం

రామన్నపేట(వలిగొండ), జూలై 3: వలిగొండ మండలం అర్రూరు గ్రామంలో జడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి సహకారంతో హైదరాబాద్‌కు చెందిన అగర్వాల్ కంటి దవాఖాన వారు బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసులుకంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, అద్దాలను అందజేశారు.

ప్రభుత్వ హాస్టల్‌లో చేరేందుకు దరఖాస్తులు

ఆలేరురూరల్, జూలై 3 : మండలంలోని కొలనుపాకలో గల షెడ్యూల్ కులాల బాలుర వసతిగృహంలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ సుక్క ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు కులం, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతచేసి ఈ నెల15 లోపు హాస్టల్‌లో అందించాలని కోరారు.

కస్తూర్బా పాఠశాలలో అదనపు భవనాన్ని నిర్మించాలి :ఐద్వా

చౌటుప్పల్, జూలై 3 : పట్టణ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో అదనపు తరగతి గదులను తక్షణమే చేపట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి డిమాండ్ చేశారు. బుధవారం కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 300 మంది విద్యార్థులకు ఒకే భవనంలో తరగతి గదులు, హాస్టల్ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బత్తుల జయమ్మ, దొడ్ల అండాలు, చింతకింది శారద, రేష్మ, సంధ్యారాణి పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై ప్రధాని మోదీ తీరు అప్రజాస్వామికం

చౌటుప్పల్, జూలై 3 : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నీట్ పరీక్ష పేపర్ లీక్ అవుతున్నా ప్రధాని మోదీ స్పందించకపోవడం అప్రజాస్వామికమని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె మధు కృష్ణ అన్నారు. పట్టణకేంద్రంలో బుధవారం నిర్వహించిన డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీతో దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తీగుళ్ల శ్రీనివాస్, దాసరి ప్రకాశ్, రుద్రగోని మధు, దోనూరి శ్రవన్‌కుమార్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

వరిలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన

రాజాపేట, జూలై 3 : మండలంలోని కుర్రారంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ భారతీయ వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు బుధవారం పర్యటించారు. నేరుగా వరివిత్తే పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి, కలుపు, చీడపీడలు, తెలుగుళ్ల నివారణపై వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పద్మావతి, లతాలక్ష్మి, శ్రీదేవి, ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, ఏఓ మాధవి, ఏఈఓ అంజయ్య పాల్గొన్నారు.

పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి

- పీఏసీఎస్ చైర్మన్ భిక్షంరెడ్డి

చౌటుప్పల్ : మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి

రామన్నపేట, జూలై3: ప్రభుత్వం రైతుభరోసాను 10ఎకరాల వరకు అందించాలని మెజార్టీ రైతులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ భిక్షంరెడ్డి తెలిపారు. బుధవారం మండలకేంద్రంలోని పీఏసీఎస్‌లో నిర్వహించిన ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశంలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. గుట్టలు, వెంచర్లు, సాగు చేయని భూములను మినహాయించాలని, సాగు చేసే భూములకు మాత్రమే రైతుభరోసా కల్పించాలని కోరారు. ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఏడీఏ దేవ్‌సింగ్, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి జంగారెడ్డి, వైస్ చైర్మన్ అంబటి ఉపేంద్ర, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ఇన్‌కమ్ ట్యాక్స్, జీఎస్టీ, రేషన్ కార్డుతో సంబంధం లేకుండా 10 ఎకరాల భూమి ఉన్న రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ దేవీసింగ్, ఎంఏఓ ముత్యాల నాగరాజు, కో ఆపరేటివ్ అధికారి శైలజా, సింగిల్‌విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న యాదయ్యగౌడ్

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి

- మాజీ సర్పచ్‌ల సంఘం రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు యాదయ్యగౌడ్

సంస్థాన్ నారాయణపురం, జూలై 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సెలవుపెట్టి అమెరికా వెళ్లిన దృష్ట్యా వారి స్థానంలో వేరే వారిని నియమించాలని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకుడు సుర్వి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని రెండు ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండడంతో పాఠాలు జరుగడం లేదన్నారు. ఈ విషయమై డీఈఓతో ఫోన్లో మాట్లాడగా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తారని డీఈఓ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తెలంగాణ భిక్షం, మాజీ సర్పంచ్‌లు పాండురంగ నాయక్, సిద్దగోని శ్రీను, గడ్డం నరేశ్ పాల్గొన్నారు.

దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు

వంగపల్లి దీక్షకు తరలిరావాలి : ఎమ్మార్పీఎస్ టీఎస్

మోటకొండూర్, జూలై 3: ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా మాదిగలకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరా పార్కు వద్ద ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ చేపట్టనున్న నిరసన దీక్షకు భారీగా తరలిరావాలని సంఘం కోర్ కమిటీ సభ్యులు చిలుకమారి గణేశ్, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకటేశ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో నిరసన దీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మాదిగలను ఎస్సీ వర్గీకరణ విషయంలో మోసం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల మంగపతి, కొల్లూరి మొగులయ్య, కొల్లూరి మైసయ్య, మందుల పరశురాములు, బొట్ల రమేశ్, వంగపల్లి జహంగీర్, కొల్లూరి రాజు, కొండమడుగు వీరనరసింహ, బొట్ల నవీన్, కొల్లూరు నరేశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డులు అందిస్తున్న అధికారులు

సైన్స్ ఒలింపియాడ్‌లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

భువనగిరి అర్బన్, జూలై 3 : జాతీయస్థాయిలో నిర్వహించిన సైన్స్ ఒలింపియాడ్‌లో పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని జిట్ట ప్రీతికారెడ్డి నేషనల్ ఫస్ట్ ర్యాంక్, 6వ తరగతికి చెందిన సల్మా ఫాతిమా స్టేట్ ఫస్ట్, మేథశ్రీ, మనుశ్రీ, సౌమ్య రాష్ట్ర స్థాయిలో5,7,8 ర్యాంకులు సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు రాష్ట్ర సైన్స్‌ఫేయిర్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ జి. ప్రభాకర్ అవార్డులు అందించారు. విద్యార్థులను, తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రఘు అఖిల, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

పట్టణ అభివృద్ధే లక్ష్యం : మున్సిపల్ చైర్మన్ రాజు

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, జూలై 3 : పట్టణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. హైవేపై బ్లాక్ స్పాట్‌లలో ఫ్లై ఓవర్ నిర్మాణాలు జరుగుతున్నాయని, చిన్నకొండూర్ రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలని కోరారు.

ట్రాక్టర్ అపహరణ

బీబీనగర్, జూలై 3 : మండలంలోని మగ్దూంపల్లి గ్రామానికి చెందిన రైతు పాదం పాండు మంగళవారం సాయంత్రం తన పొలం వద్ద ట్రాక్టర్‌ను నిలిపి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌కు ఉన్న ఐరన్ వీల్స్‌ని అక్కడే వదిలి ట్రాక్టర్‌ని ఎత్తుకెళ్లారు. ఈ విషయమై బాధితుడు పాండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎన్. రమేష్ తెలిపారు.